సాక్షి
ఖమ్మం
సోమవారం । 6 । అక్టోబర్ । 2025



ఈ ప్రయాణం ప్రహసనమే

విజయదశమి పండుగకు స్వస్థలాలకు వచ్చిన వారంతా ఆదివారం తిరుగుముఖం పట్టడంతో బస్టాండ్లన్నీ కిటకిటలాడాయి. 8లో



వరుణుడి కటాక్షం

ఈ ఏడాది సాధారణానికి మించి వర్షపాతం నమోదవడంతో అధికారుల అంచనాలను దాటి పంటలు సాగయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఎండ ప్రభావం ఉంటుంది. ఉష్ణోగ్రతలు గంటగంటకు పెరుగుతూ మధ్యాహ్నం గరిష్టస్థాయికి చేరే అవకాశముంది.

న్యూస్‌రీల్

కోటమైసమ్మకు మొక్కుల చెల్లింపు



జాతర ప్రాంగణంలో భక్తుల రద్దీ

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి జాతర కొనసాగుతోంది. దసరా పర్వదినాన మొదలైన జాతరకు భక్తజనం ఇంకా పోటెత్తుతూనే ఉన్నారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయ ధర్మదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తేనెటీగల పెంపకం లాభదాయకం



తేనెటీగల బాక్సులు అందిస్తున్న సంస్థ బాధ్యులు

సత్తుపల్లి: తేనెటీగల పెంపకం లాభదాయకంగా ఉంటుందని తెలంగాణ బీ హబ్ సొసైటీ అధ్యక్షుడు కె.ఇంద్రారెడ్డి తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సూచనల మేరకు సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో సయోధ్య ఎన్‌జీఓ సహకారంతో గిరిజనులకు తేనెటీగల పెంపకంపై ఆదివారం శిక్షణ ఏర్పాటుచేశారు. తేనెటీగల పెంపకం, తేనె సేకరణలో అధునాతన పద్ధతులు, మార్కెటింగ్ విధానంపై అవగాహన కల్పించాక 29 మందికి తేనెటీగల బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేంజర్ టి.స్నేహలత, ఎఫ్ఎస్ఓ నాగరాజు, బీట్ అధికారులు కిరణ్, కృష్ణ, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ దీపక్, బీ హబ్ సెక్రటరీ నిమ్మల రామచంద్రయ్యతో పాటు డాక్టర్ తిరుమలేష్, మృదుల, సీతాలక్ష్మణ్, బాబు, చుక్కమ్మ, మట్టా పద్మ, సురేష్, ఉష, కుమార్ పాల్గొన్నారు.

రేపు బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాలికల ఫుట్‌బాల్ జట్టును మంగళవారం ఎంపిక చేయనున్నట్లు జూనియర్ కళాశాలల క్రీడా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.డీ.మూసాకలీం తెలిపారు. ఖమ్మంలోని మున్సిపల్ స్పోర్ట్స్ పార్క్‌లో జరిగే ఎంపిక పోటీలకు క్రీడాకారిణిలు వయసు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99896 47696, 97037 85786 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

12న హాకీ ఎంపికలు..

ఉమ్మడి జిల్లాస్థాయి బాలబాలికల హాకీ జట్లను ఈనెల 12వ తేదీన కొత్తగూడెంలోని ఎస్‌ఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేయనున్నట్లు ఎం.డీ.మూసీ కలీం వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకర పత్రం, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

జేకే ఓసీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఇల్లెందు : నూతన జేకే ఓసీ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామని సింగరేణి డైరెక్టర్(పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. అనంతరం జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఓసీ ఏర్పాటుకు గల అడ్డంకులు తొలగిపోయేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిగమించాలని, రవాణాకు ఎలాంటి ఆటంకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఉపరితల గనుల్లో ఉద్యోగులు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జీఎం వీసం కృష్ణయ్య, అధికారులు రామస్వామి, నరసింహరాజు, గిరిధర్‌రావు, జాకీర్ హుస్సేన్, తుకారం, రామ్మూర్తి, శివ వీరకుమార్, శివప్రసాద్, సతీష్ కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధి కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువుదీరిన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలలతో పాటు పొరుగు జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

లక్షణంగా వైద్యసేవలు!

పోటెత్తుతున్న జిల్లా జనరల్ ఆస్పత్రి

- ఈ ఏడాది 2.50లక్షలు దాటిన ఓపీ సేవలు
- సీజన్‌లో లక్ష మందికి పైగానే వైద్యం
- సీజనల్ వ్యాధుల వ్యాప్తితో హాస్పిటల్ కిటకిట



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ ఏడాది చికిత్స కోసం జనం భారీగా వస్తున్నారు. దాదాపు ప్రతీరోజు ఓపీ విభాగం వద్ద ఉదయం నుండి మధ్యాహ్నం వరకు క్యూలైన్లు నిండి ఉంటున్నాయి. గతంలో కంటే ఓపీ సేవలు మెరుగుపడినట్లు గణాంకాలు చెబుతుండగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు లక్షల మందికిపైగా వైద్యసేవలు పొందారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ పరిధిలోకి వెళ్లాక పెద్దాస్పత్రిలో కొంత కాలం తాకిడి తగ్గింది. క్రమక్రమంగా వైద్యులు, సిబ్బంది పోస్టులు భర్తీ చేయడంతో ఓపీ, ఐపీ విభాగాల్లో చికిత్స కోసం వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సీజనల్ వ్యాధుల ప్రభావం కూడా తోడవడంతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది.

– ఖమ్మంవైద్యవిభాగం

సింహభాగం సీజనల్ వ్యాధులతోనే...

సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన పెద్దాస్పత్రిలో వైద్య సేవలు పొందేందుకు భారీగా వస్తున్నారు. సాధారణంగా జూన్ నుండి సెప్టెంబర్ వరకు సీజనల్ వ్యాధుల కాలంగా పరిగణిస్తారు. ఈ సమయంలో జలుబు, దగ్గు, జ్వరం, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, డయేరియా ప్రబలే అవకాశం ఉంటుంది. ఈ సమయాన పెద్దాస్పత్రిలో 1,35,693 మంది వైద్యసేవలు పొందారు. ఇందులో ఎక్కువగా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారే ఉన్నారని తెలుస్తోంది. అలాగే 10,302 మంది ఇన్‌పేషెంట్లు చికిత్స చేయించుకున్నారు. జనవరి నుండి పరిశీలిస్తే ఇప్పటి వరకు 2,69,639 మంది ఓపీ సేవలు తీసుకోగా.. వీరిలో 22,877 మంది ఆస్పత్రిలో చేరారు. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు 45,969 మందికి అత్యవసర చికిత్స అందించారు. తరచుగా వర్షం కురుస్తూ నీరు నిలుస్తున్న కారణంగా సీజనల్ వ్యాధుల ప్రభావం తగ్గడం లేదని తెలుస్తోంది. ఫలితంగా సెప్టెంబర్ నెలలోనూ ఓపీ విభాగానికి వచ్చిన సంఖ్య ఏ మాత్రం తగ్గలేదు. జిల్లాలో పల్లె, పట్టణ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు అందుబాటులో ఉన్నా ఎక్కువ మంది పెద్దాస్పత్రికి రావడానికే మొగ్గు చూపుతున్నారు.

నిరంతరం పర్యవేక్షణ



సీజనల్ వ్యాధుల ప్రభావంతో ఆస్పత్రికి తాకిడి పెరుతుండగా వైద్యులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నాం. ఇన్‌పేషంట్ వార్డుల్లోనూ నిరంతరం వైద్యులు ఉంటున్నారు. నిత్యం 1,500 నుంచి 2వేల మంది వైద్యసేవలు పొందుతున్నారు. ఎక్కువగా వైరల్ ఫీవర్స్, జలుబు, దగ్గు, డయోరియా, డెంగీతో బాధపడుతున్న వారు వస్తున్నారు. మందుల కొరత రాకుండా ముందస్తుగానే అందుబాటులో ఉంచాం. – **ఎం.నరేందర్, జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్**

దడపుట్టిస్తున్న వ్యాధుల వ్యాప్తి

ఎడతెరిపి లేని వర్షాలతో దోమలు వృద్ధి చెంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. విషజ్వరాలకు తోడు డెంగీ, మలేరియా, దగ్గు, జలుబు, డయేరియాతో ప్రజలు వణికిపోతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సరిహద్దు జిల్లాలైన మహబూబాబాద్, సూర్యాపేట తదితర జిల్లాల ప్రజలు కూడా పెద్దాస్పత్రికి వస్తుండటంతో నిత్యం కిటకిటలాడుతోంది. జిల్లాలో గత ఏడాది 32,656 మందికి డెంగీ పరీక్షలు చేయగా 529 మందికి నిర్ధారణ అయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 13,435మందికి పరీక్షలు చేయగా 208మంది డెంగీ బారిన పడినట్లు గుర్తించారు. ఒక ఆగస్టులోనే 101 డెంగీ కేసులు వెలుగు చూడగా, సెప్టెంబర్‌లో 75, జూలైలో 27 కేసులు బయటపడ్డాయి. ఈసారి మలేరియా, చికెన్‌గున్యా ప్రభావం లేకపోయినా వైరల్ ఫీవర్స్ వ్యాప్తి అధికంగా ఉంటోంది. దీనికి తోడు కలుషితమైన నీరు కారణంగా డయేరియా కేసులు పెరుగుతున్నాయి.

పెద్దాస్పత్రిలో సెప్టెంబర్ వరకు ఓపీ, ఐపీ వివరాలు

నెల	ఓపీ	ఐపీ
జనవరి	26,269	2,844
ఫిబ్రవరి	23,860	2,134
మార్చి	27,816	2,888
ఏప్రిల్	28,473	2,591
మే	27,528	2,118
జూన్	29,560	1,553
జూలై	38,336	3,209
ఆగస్టు	33,672	2,833
సెప్టెంబర్	34,125	2,707
మొత్తం	2,69,639	22,877

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆదివారం కావడంతో భక్తులు స్వామి వారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నిత్యకల్యాణంలోనూ భారీగా పాల్గొన్నారు.

గోశాల, శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించే గోశాల, శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన టీకే శ్వేత అనే భక్తురాలు గోశాలకు రూ.75,510, నిత్యాన్నదానానికి రూ.1,01,116 ఆలయ ఈఓ దామోదర్‌రావుకు అందజేశారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఉద్యమ గుమ్మం నుంచే రణనినాదం

- చరిత్రలో నిలిచిపోయేలా సీపీఐ శత వసంతాల ముగింపు సభ
- ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో వక్తలు
- హాజరైన కె.నారాయణ, పువ్వాడ, కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యమ గుమ్మమైన ఖమ్మం నుంచే రణనినాదం మోగించడమే కాక పునరుత్తేజంతో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి జరగాలని సీపీఐ జాతీయ నాయకులు పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు లేని వ్యవస్థ మనజాలక పోగా, రానున్న కాలం కమ్యూనిస్టులదే అయినందున విస్తరణకు పునరంకితం కావడమే అందరి కర్తవ్యమని అన్నారు. సీపీఐ శత వసంతాల ముగింపు సభ డిసెంబర్ 26న జరగనున్న నేపథ్యాన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశాన్ని ఆదివారం ఖమ్మంలో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఖమ్మానికి ప్రత్యేక స్థానం ఉందని, ఆంధ్ర మహాసభ ద్వారా నైజాం పతనానికి నాంది పలికిన ఇక్కడ శత వసంత వేడుకల ముగింపు సభ జరగనుందని తెలిపారు. దేశవ్యాప్తంగా బహు పోరాటాలకు వేదికగా నిలిచిన కమ్యూనిస్టు పార్టీ ఇప్పుడు ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు పునరంకితమవుతోందని తెలిపారు. ఇటీవల జరిగిన ఛండీఘర్ మహాసభ ఇదే పిలుపునిచ్చిందని నారాయణ గుర్తుచేశారు. కాగా, స్వాతంత్ర్య పోరాటంలోనూ, ఆ తర్వాత సామాజిక చైతన్యం కోసం జరిగిన ఏ పోరాటంతో సంబంధం లేని దేశద్రోహులు దేశభక్తులుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని బీజేపీ ధ్వంసం చేస్తోందని, ఫెడరల్ స్ఫూర్తికి తిలోదకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మావోయిస్టులను తుద ముట్టిస్తామని చెబుతుండగా.. మావోయిస్టులు అంతమైనా ఆ సిద్ధాంతం అంతం కాదని తేల్చిచెప్పారు. దేశాన్ని ముక్కలు కానివ్వమనే నినాదంతో పాటు గ్రామగ్రామాన కమ్యూనిస్టు పార్టీ విస్తరణే లక్ష్యంగా శత వసంత సభ నిర్వహిస్తామని నారాయణ తెలిపారు.



మాట్లాడుతున్న కె.నారాయణ, వేదికపై కూనంనేని, పువ్వాడ, వెంకటరెడ్డి తదితరులు

ఆర్‌ఎస్‌ఎస్‌ది అధికార కాంక్ష..

ఆర్‌ఎస్‌ఎస్‌ది అధికార కాంక్ష మాత్రమే కాక విభజన, విధ్వంసం మాత్రమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తెలిపారు. సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు సైద్ధాంతిక నిర్మాణంతో రాజకీయ లక్ష్యం కోసం పనిచేస్తున్నారని చెప్పారు. బలహీనపడినా పునరుత్తేజం తథ్యమని తెలిపారు. కొందరు అలవికాని హామీలు, ధన ప్రభావం ఇతరత్రా కారణాలతో ఎన్నికల్లో సానుకూల ఫలితాలు సాధించి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టులే దేశానికి రక్ష, రాజకీయ ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన కూనంనేని మాట్లాడుతూ త్యాగాల చరిత్రతో కమ్యూనిస్టులు ముందుకు సాగుతుంటే.. స్వార్థ చింతన, అధికార లక్ష్యంతో ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తోందని అన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు టీఎం.మూర్తి, పుదుచ్చేరి రాష్ట్ర కార్యదర్శి సలీం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు మాట్లాడగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి, అజీజ్‌పాషా, అక్కినేని వనజ, ముప్పాల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, రావుల వెంకయ్య, దండి సురేష్, ఎస్.కే.సాబీర్‌పాషా, నగర ప్రముఖులు ఎంఎఫ్.గోపీనాథ్, డాక్టర్ పి.గోర్కి, డాక్టర్ వై.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆనందం మరిచిపోలేనిది..

ప్రధాని నుంచి అవార్డు స్వీకరించిన పల్లవి

ఖమ్మంరూరల్: ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం మరిచిపోలేని మధురానుభూతి అని జిల్లాకు చెందిన తాళ్లూరి పల్లవి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులకు చెందిన ఆమె శ్రీ చైతన్య కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తిచేశాక హైదరాబాద్‌లో ఏడాది పాటు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో శిక్షణ తీసుకుంది. ఆపై నిర్వహించిన పరీక్షలో జాతీయ స్థాయి టాపర్‌గా నిలవడంతో తాజాగా ప్రధాని చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఈ నేపథ్యాన శ్రీచైతన్య కళాశాలలో పల్లవిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ పల్లవి విజయం మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం పల్లవి మాట్లాడుతూ పరీక్షలో టాపర్‌గా నిలిచినప్పుడు సంతోషించినా.. ప్రధాని చేతుల మీదుగా అవార్డు అందుకోవడం మరింత ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అకడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



పల్లవిని సన్మానిస్తున్న శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచి ప్రధాని చేతుల మీదుగా అవార్డు అందుకున్న పల్లవిని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభినందించారు. ఆమెతో ఆదివారం ఫోన్‌లో మాట్లాడిన ఆయన భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

పాన్‌మసాలా తయారీలో కలప!

- ఉత్తరాది రాష్ట్రాల్లో రెండు ఫ్యాక్టరీలు సీజ్
- మహబూబాబాద్ కేంద్రంగా సండ్ర కలప అక్రమ రవాణా
- దందాపై విచారణలో గుర్తించిన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తరాది రాష్ట్రాలకు అక్రమ కలప రవాణా వ్యవహారంపై చేపడుతున్న విచారణలో ఆసక్తికరమైన అంశాలు బయటపడుతున్నాయి. 'నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్'(ఎన్టీపీసీ) పేరిట తెలంగాణ నుంచి అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను కొంత కాలంగా రవాణా చేస్తున్నారు. సర్కారీ తుమ్మ కలప మాటున 'సండ్ర' కలపను రవాణా చేస్తుండగా మధ్యప్రదేశ్‌లో అక్కడి అటవీ అధికారులు గుర్తించి జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు విచారణ చేపట్టిన అధికారులు సండ్ర కలపను ఉత్తరాది రాష్ట్రాల్లో పాన్ మసాలా తయారీలో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అటవీ జాతుల వృక్షాలు, మొక్కలు లేని చింతకాని ప్రాంతం నుంచి నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ విధానంలో 44 జాతుల కలపకు ఆన్‌లైన్‌లో ఎన్‌టీసీ తీసుకున్నట్లు తేల్చారు. ఇందులో సర్కారీ తుమ్మ కలప కూడా ఉండగా ఆ స్థానంలో భారీగా సండ్ర జాతి కలపను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణా రాష్ట్రాలకు తరలించినట్లు బయటపడింది.

మూడు జిల్లాల్లో వృక్షాలు

అనుమతి పేరిట 'సండ్ర' కలప మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా అక్రమంగా తరలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే మహబూబాబాద్ నుంచి కలప రవాణా చేసిన వాహనాన్ని గుర్తించి సీజ్ చేశారు. మహబూబాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల వరకు అనేక ప్రాంతాల్లో సండ్ర జాతి వృక్షాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి సండ్ర జాతి కలపను సేకరించి సర్కారీ తుమ్మ లభించే ప్రాంతాల పేరిట పర్మిట్లను సృష్టించి ఉత్తరాది రాష్ట్రాలకు కలప రవాణా చేస్తున్నట్లుగా తేల్చారు.

పాన్ మసాలా ఫ్యాక్టరీలు సీజ్

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో పాన్‌మసాలా తయారీ ఫ్యాక్టరీలు ఉండగా.. అందులో సండ్ర కలప ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. తొలుత జమ్మూకశ్మీర్ ప్రాంతాల నుంచి కలప దిగుమతి చేసుకునేవారు. అక్కడితో పోలిస్తే తెలంగాణ ప్రాంతంలోని సండ్ర కలప మరింత మంచిదని గుర్తించిన యాజమాన్యాలు ఇక్కడి దళారులతో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇక్కడి వ్యాపారులు సర్కారీ తుమ్మ మాటున 'సండ్ర' కలపను అక్రమ రవాణా చేస్తుండగా.. అటవీ అధికారులు రెండు ఫ్యాక్టరీలను సీజ్ చేశారు.

టేకు కన్నా సండ్రకే డిమాండ్

ఉత్తరాది రాష్ట్రాల్లో టేకు కన్నా సండ్ర కలపకు డిమాండ్ ఎక్కువ. దీంతో అనుమతి ఉన్న కలప మాటున అనుమతులు లేని సండ్ర కలప తెలంగాణ నుంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల అటవీ శాఖల అధికారులు కలప రవాణాపై నిఘా వేసి రెండు పాన్ మసాలా ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. మహబూబాబాద్ కేంద్రంగా రవాణాకు ఉపయోగించిన ఓ వాహనం కూడా పట్టుబడింది. నిర్మల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలపై కూడా ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

– **సిద్ధార్థ విక్రమ్ సింగ్, జిల్లా అటవీ శాఖాధికారి**

ప్రతిపాదనలతోనే సరి

- మరమ్మతుకు నోచుకోని ఆర్‌అండ్‌బీ రహదారులు
- నిధులు విడుదల కాకపోవడంతో కష్టాలు
- గుంతల్లో రాకపోకలతో వాహనదారుల అవస్థ



ఖమ్మం – తిమ్మరావుపేట మార్గంలో గుంతలు తేలిన రహదారి



బిల్లులు అందక మంచుకొండ వద్ద ఆగిన రహదారి విస్తరణ పనులు

ఖమ్మం అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్ బీ పరిధిలోని రహదారులు ఇటీవల వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల గుంతలు తేలినా మరమ్మతులు లేకపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులకు కూడా నిధులు అందక అనేక ప్రాంతాల్లో రోడ్లు ప్రమాదకరంగా మారాయి. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై తారు పొరలు ఊడిపోగా, గుంతలు మరింత పెద్దవయ్యాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం అధికారులు పంపిన ప్రతిపాదనలకు మోక్షం లభించక ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో సుమారు 120 కిలోమీటర్ల రోడ్ల శాశ్వత మరమ్మతుల కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదనలు పంపిన అధికారులు ఎదురుచూస్తున్నారు.

నిలిచిన పనులు

ఖమ్మం – ఇల్లెందు నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులు రూ.40 కోట్ల అంచనాలతో ప్రారంభమయ్యాయి. రఘునాథపాలెం, మంచుకొండ వరకు సుమారు రూ.10 కోట్ల విలువైన పనులు చేసినా కాంట్రాక్టర్‌కు బిల్లులు అందలేదు. దీంతో పనులు మధ్యలోనే నిలిపివేశాడు. ఫలితంగా ఆ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షాలకు ఏర్పడిన గుంతల్లో చెత్త, నీరు పేరుకుపోయి ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలోని పలు ప్రాంతాల్లో నెలకొంది. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొత్త పనులకు టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదని సమాచారం.

కమ్మేసిన కంపచెట్లు, చెట్లపొదలు

రహదారులపై గుంతలకు తోడు పలుచోట్ల ఇరువైపులా పెరిగిన కంపచెట్లు, పొదలు కూడా వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. తారు రోడ్ల అంచుల వరకూ అల్లుకుపోయిన పొదలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రధానంగా మూలమలపుల వద్ద, రాత్రివేళ ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఏటా వర్షాకాలం అనంతరం చేపట్టే జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా ఈసారి నిధుల కొరతతో ఆగిపోయాయి.

వాహనదారుల గోడు...

ఖమ్మం – తిమ్మరావుపేట, ఖమ్మం – ఏన్కూరు వయా పండితాపురం ఖమ్మం – బోనకల్, పల్లిపాడు – ఏన్కూరు రహదారులు అధ్వానంగా మారాయి. ఇవేకాక సత్తుపల్లి, పాలేరు నియోజకవర్గాల్లోని పలు ప్రధాన రహదారులపైనా ఇదే పరిస్థితి నెలకొంది. ఖమ్మం – సత్తుపల్లి, తల్లాడ – కొత్తగూడెం తదితర రాష్ట్ర రహదారులన్నీ గుంతలమయమై ప్రయాణం భయానకంగా మారింది. పగటివేళ కూడా ప్రయాణం కష్టంగా మారడమే కాక రాత్రివేళ వాహనదారులు ఎంత జాగ్రత్తగా నడిపినా ఇక్కట్లు తప్పడం లేదు.

నిధుల కొరతే కారణం

ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు కాకపోవడమే సమస్యగా మారింది. శాశ్వత మరమ్మతుల మాటేమో కానీ తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.8 కోట్లతో అంచనాలు పంపినా నిధులు రాకపోగా.. ఉన్న అరకొర నిధులతో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. కొందరు కాంట్రాక్టర్లు పనులు చేయకుండా ముఖం చాటేయడంతో అధికారులు పలు దఫాలు నోటీసులు జారీ చేసినా స్పందన ఉండడం లేదని చెబుతున్నారు.

ప్రతిపాదనలు సమర్పించాం..



వివిధ ప్రాంతాల్లో ఇటీవల వర్షాలతో రహదారులు దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మొత్తంగా రూ.83కోట్లు మంజూరు కావాల్సి ఉంది. తాత్కాలికంగా గుంతలు పూడ్చేందుకు టెండర్లు పిలిచాం. ఖరారైన చోట పనులు చేపడుతాం.

– **యాకూబ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ**

క్లుప్తంగా

ఇద్దరు విద్యార్థినిలకు రూ.1.60 లక్షల ఆర్థికసాయం



విద్యార్థినులకు చెక్కులు అందజేస్తున్న రామారావు

కల్లూరు: స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఇద్దరు విద్యార్థినుల చదువుకు రూ.1.60 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. నల్లగొండ జిల్లా చందనపేట మండలం తెల్దేవరపల్లికి చెందిన లింగంపల్లి గోవింద్ – వాణి దంపతుల కుమార్తెల్లో పద్మ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం, పావని బీటెక్ చదువుతోంది. కూలీపనులు చేసే గోవింద్‌కు వీరి ఫీజులు చెల్లించే స్తోమత లేక స్ఫూర్తి ఫౌండేషన్ బాధ్యుడు వరకా రామారావును ఆశ్రయించగా అమెరికాకు చెందిన దాత డాక్టర్ చిట్టిబోయిన శిరీష ద్వారా రూ.1.60లక్షల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్, బాధ్యుడు వరక రామారావు, దాత శిరీషకు వీరి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎంపీ జయంతి


వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: మాజీ ఎంపీ జి.వెంకటస్వామి జయంతిని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటం వద్ద కలెక్టరేట్ ఏఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ సిబ్బంది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సైంటిస్టు అశ్విని, ఆమె తండ్రికి గుడి

విగ్రహాలను ఆవిష్కరించిన కుటుంబీకులు


విగ్రహాల వద్ద అశ్విని సోదరుడు అశోక్, తల్లి నేజీ

కారేపల్లి: గత ఏడాది వరదల సమయాన ఆకేరు ప్రవాహంలో కారు కొట్టుకుపోవడంతో మండలంలోని గంగారంతండాకు చెందిన అగ్రికల్చర్ సైంటిస్టు అశ్విని, ఆమె తండ్రి నూనావత్ మోతీలాల్ మృతి చెందిన విషయం విదితమే. వీరి జ్ఞాపకార్థం అశ్విని సోదరుడు అశోక్ గుడి నిర్మించాడు. గ్రామంలోని తమ వ్యవసాయ క్షేత్రంలో గుడి నిర్మించడమే కాక అశ్విని, మోతీలాల్ విగ్రహాలను ఏర్పాటు చేయగా మోతీలాల్ భార్య నేజీ ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు.

తాళం పగలగొట్టి చోరీ

మధిర: మధిర 21వ వార్డుకు చెందిన వెంపాటి రాజేంద్రప్రసాద్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దసరా సందర్భంగా రాజేంద్రప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి వారం క్రితం ఏపీలోనిఎన్టీఆర్ జిల్లా జి.కొండూరులో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఆదివారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం, లోపల బీరువాను పగలగొట్టినట్లు గమనించారు. బీరువాలోని 12 గ్రాముల బంగారంతో పాటు నాలుగు బియ్యం బస్తాలు, నాలుగు ఇత్తడి కాగులు చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖమ్మంఅర్బన్: నగరంలోని ధంసలాపురం వద్ద మున్నేటి ఒడ్డున పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. వీరి నుంచి రూ.6వేల నగదు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

కానిస్టేబుల్ కుటుంబసభ్యులపై దాడి

చింతకాని: ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కానిస్టేబుల్ కట్టికోల శ్రీనివాస్ కుటుంబ సభ్యులపై పాతర్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన కొందరు ఆదివారం రాత్రి దాడిచేశారు. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి కారులో ఏపీలోని పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి దైవదర్శనానికి వెళ్లి వస్తున్నాడు. చింతకాని మండలం పాతర్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై మక్కపేట నుంచి కారును వెంబడించారు. వత్సవాయి వద్ద కారును ఆపి దుర్భాషలాడగా కానిస్టేబుల్ డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. దీంతో బోనకల్ పోలీసులు రోడ్డు వద్దకు చేరుకోగా ఇద్దరు తప్పించుకుని నాగులవంచ చేరుకున్నారు. అక్కడ పాతర్లపాడు ఎస్సీ కాలనీ నుంచి మరికొందరిని పిలిపించి కానిస్టేబుల్ కారును నాగులవంచ సెంటర్‌లో అడ్డుకుని దాడిచేశారు. ఘటనలో శ్రీనివాస్, ఇద్దరు మహిళలు గాయపడగా, ఓ మహిళ మెడలో ఉన్న నల్లపూసల గొలుసు లాక్కెళ్లారు. దీంతో కొద్దిసేపు ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై వీరేందర్ చేరుకుని వివరాలు సేకరించారు.

ఈ ప్రయాణం ప్రహసనమే..

- దసరా సెలవులు ముగియడంతో తిరుగుముఖం
- బస్టాండ్లలో ఒకేసారి ప్రయాణికుల రద్దీ
- ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినా తీరని ఇక్కట్లు


కల్లూరు : బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న ఖమ్మం కొత్తబస్టాండ్



తల్లాడ : ఫుట్‌బోర్డుపై నిలుచుని వెళ్తున్న ప్రయాణికులు

ఖమ్మంమయూరిసెంటర్: దసరా పండుగ అనంతరం తిరిగి గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులతో జిల్లాలోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. ఖమ్మం రీజియన్ ఆధ్వర్యాన దసరా సెలవులకు వచ్చివెళ్లే వారి కోసం వందల సంఖ్యలో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేశారు. అయినా రద్దీకి ఏ సరిపోవడం లేదు. సెలవులు ముగియడం, సోమవారం నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కానుండడంతో ఆదివారం జనమంతా ఒకేసారి తిరుగుముఖం పట్టారు. హైదరాబాద్, వరంగల్‌తో పాటు ఇతర నగరాలకు వెళ్తుండగా రిజర్వేషన్ లేని వారు బస్సు ఎక్కేందుకు నానా పాట్లు పడుతున్నారు.

సరిపోని ప్రత్యేక బస్సులు

ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేసిన అధికారులు గతంతో పోలిస్తే ఈసారి అదనంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యాన రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి ఆదివారం మొత్తం 400 బస్సుల్లో 250 బస్సులను ప్రత్యేక సర్వీసులుగా నడిపారు. వీటిలో 100 బస్సులకు రిజర్వేషన్ ఉంది. మరో 150 బస్సులు నాన్ రిజర్వేషన్ సర్వీసుల కింద నడపగా బస్సులు ఎక్కేందుకు జనం నానా తంటాలు పడ్డారు.

ఇసుకేస్తే రాలనంత..

రీజియన్ పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు బస్టాండ్లు ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడాయి. పండుగ కోసం హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల నుంచి వచ్చిన జనం సెలవులు ముగియడంతో మళ్లీ తిరిగి వెళ్లేందుకు బస్టాండ్లకు చేరుకున్నారు. సుదూర ప్రాంతాలను మినహాయిస్తే హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండడం.. రిజర్వేషన్ దొరకని వారు నేరుగా రావడంతో బస్సుల్లో సీట్లు దొరకడం గగనమైపోయింది.

అక్కడే ఫుల్..

రెగ్యులర్‌గా హైదరాబాద్ వెళ్లే లహరి, రాజధాని, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ముందుగానే రిజర్వేషన్లు పూర్తయ్యాయి. ఈ బస్సుల ప్రారంభ స్థానంలోనే నిండిపోతుండగా.. తర్వాతి బస్టాండ్లల్లో ప్రయాణికులు ఎక్కడానికి వీలు లేకుండా పోయింది. మిగిలిన ప్రయాణికులకు స్పెషల్ బస్సులే అందుబాటులో ఉండడం.. ఇందులో సీట్లు దొరకక కొందరు బస్టాండ్ల బయట ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

పర్యవేక్షిస్తున్న అధికారులు

తిరుగు పయనమైన వారితో బస్టాండ్లు కిటకిటలాడుతుండగా ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ అన్ని డిపోల మేనేజర్లను అప్రమత్తం చేశారు. ఆర్ఎం, డిప్యూటీ ఆర్ఎం, ఖమ్మం డిపో మేనేజర్‌లు ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రత్యేక బస్సులు, ఇతర డిపోల నుండి వచ్చిన బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు చేస్తూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు సమకూర్చారు. ఇక వేలాది మంది ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిటలాడుతుండగా అవాంఛనీయ ఘటనలు, చోరీలు జరగకుండా ఆర్టీసీ భద్రతా అధికారులు సిబ్బందితో 24 గంటల పాటు నిఘా ఏర్పాటు చేశారు. అటు పోలీస్ అధికారులు కూడా గస్తీ తిరుగుతున్నారు.

ఫుట్‌బోర్డుపైనే ప్రయాణం

కల్లూరురూరల్/తల్లాడ: దసరా పండుగ కోసం సొంత గ్రామాలకు వచ్చిన ప్రజలు తిరిగి వెళ్తుండడంతో ఆదివారం బసాండ్లలోరద్దీ ఏర్పడింది. సరిపడా బస్సులు లేకపోవడం సమస్యకు కారణమైంది. అరకొరగానే బస్సులు వస్తుండడంతో ప్రమాదమని తెలిసినా త్వరగా వెళ్లాలనే భావనతో పలువురు ఫుట్‌బోర్డులపైనే నిలుచుని ప్రయాణించడం కనిపించింది.

కోడ్ కూసింది.. జాగ్రత్త !

- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన అమల్లోకి 'ఎంసీసీ'
- నిఘా కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు

ఖమ్మం సహకారనగర్: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఫలితంగా అన్ని పార్టీల నాయకులు, పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

ఏమిటీ కోడ్ ?

పోటీ చేసే అభ్యర్థులు, అధికారం, ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను ఎన్నికల సమయాన సమానంగా చూడడంతో పాటు నిబంధనలు మీరకుండా పర్యవేక్షించేందుకు కోడ్ అమలుచేస్తారు. ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక బృందాలను సైతం ఏర్పాటుచేశారు. సాధారణ ప్రవర్తన, సమావేశాలు, ఊరేగింపులు, రోజువారీ కార్యకలాపాలు, పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణ ఈ జాబితాలో ఉంటాయి.

ఏం చేయాలి.. ఏం చేయొద్దు...

కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన మంత్రులు అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంగా ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. అధికారిక వాహనాలను అధికారిక నివాసం నుంచి కార్యాలయానికి, అధికారిక పనులకే వినియోగించాలి. ఎవరైనా హోదాను దుర్వినియోగం చేస్తే అధికారిక వాహనాలను ఉపసంహరించుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా కూడా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని అధికారిక చర్చలకు కూడా పిలవకూడదు. స్థానిక ఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనకు వచ్చినా మంత్రులు అధికారులను పిలిస్తే వారు వెళ్తే కనక నిబంధనలకు విరుద్ధంగానే భావించి ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాలనుముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

ప్రచారంలో జాగ్రత్తలు

ఎన్నికల ప్రచార సమయాన పార్టీ, అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విభేదాలను తీవ్రతరం చేయటం, పరస్పర ద్వేషాభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. పరస్పర విమర్శల సమయాన పార్టీ విధానాలకు, కార్యక్రమాలు, గత చరిత్రకు మాత్రమే కట్టుబడి ఉండాలి. నిరాధర ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

57 ఏళ్ల వయస్సు.. 41ఏళ్ల స్నేహం !


సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

తల్లాడ: వారంతా తల్లాడ మండలం కుర్నవల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1983–84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు.. ప్రస్తుతం అందరి వయస్సు దాదాపు 57ఏళ్లు. ఇన్నాళ్ల తర్వాత ఇదే బ్యాచ్‌కు చెందిన యన్నం శ్రీనివాసరెడ్డి అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చారు. చదువు నేర్పిన గురువులను సైతం ఆహ్వానించి ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఏర్పాటుచేశారు. వృత్తి, ఉద్యోగాలు, ఆరోగ్యంతో పాటు పిల్లల ఎదుగుదల వివరాలు పరస్పరం తెలుసుకుంటూ రోజంతా సందడిగా గడిపారు. ఆపై గురువులను సన్మానించి త్వరలోనే మళ్లీ కలవాలని నిర్ణయించుకుని బరువైన హృదయాలతో వెనుదిరిగారు.

వరుణుడి కటాక్షం


ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో సాగవుతున్న వరి

- ఈ ఏడాది సాధారణానికి మించి వర్షపాతం
- సీజన్‌లోకెల్లా ఆగస్టులో అధిక వర్షాలు
- అనుకూలించిన వానలతో సమృద్ధిగా పంటల సాగు

జిల్లాలో వర్షపాతం వివరాలు (మి.మీ.ల్లో)

నెల	సాధారణం	నమోదు
జూన్	131.2	123.9
జూలై	240.9	281.6
ఆగస్టు	240.0	389.7
సెప్టెంబర్	179.0	241.1

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది వానదేవుడు అనుకూలించాడు. వరుణుడి కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురవడంతో జలాశయాలు నిండగా పంటలు అంచనాలకు మించి సాగవుతున్నాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. జూన్‌లో స్వల్పంగా తగ్గినా.. జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌ల్లో మాత్రం లక్ష్యానికి మించి వర్షాలు కురిశాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం కొంత తక్కువగానే ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలోనే ఉండడం విశేషం. సమృద్ధిగా కురిసిన వానలతో జలాశయాలు సకాలంలో నిండడం.. సాగర్ జలాలు కూడా చేరడంతో పంటల సాగు విస్తీర్ణం లక్ష్యాలను మించి నమోదైంది.

అంతకు మించి...

ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు జిల్లాలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైంది. జూన్ మినహా మిగిలిన మూడు నెలలు అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 131.2 మి.మీ.కు 123.9 మి.మీ.లు నమోవడంతో రైతుల్లో కొంత నిరాశ అలుముకుంది. కానీ జూన్ ఆరంభానికి ముందు మే 25, 26వ తేదీల్లో రోహిణి కార్తెలోనే వానలు ప్రారంభమయ్యాయి. దీంతో అప్పుడే జిల్లాలో వ్యవసాయ పనులు మొదలైనా జూన్‌లో కాస్త ఇబ్బందపడ్డారు. ఇక జూలైలో సాధరణానికి మించి 16.9 శాతం, ఆగస్టులో 62.4 శాతం, సెప్టెంబర్‌లో 34.7 శాతం వర్షపాతం అధికంగా నమోదైంది.

ఆగస్టులో అదుర్స్

నాలుగు నెలల్లో పరిశీలిస్తే ఆగస్టు నెలలో అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 240 మి.మీ.లు కాగా 389.7 మి.మీ.గా నమోదు కావడంతో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 52 రోజులు వర్షం కురవగా, ఆగస్టులో 17 రోజుల పాటు వర్షం కురిసింది.

సస్యశ్యామలం

సమృద్ధిగా కురిసిన వర్షాలు పంటల సాగుకు దోహదపడ్డాయి. ఈ ఏడాది వ్యవసాయ శాఖ అన్ని పంటలు కలిపి 6,08,348 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. కానీ 6,97,441 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రధానంగా పత్తి, వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 2,87,928 ఎకరాలు కాగా 2,95,012 ఎకరాల్లో, పత్తి 2,15,643 ఎకరాలకు గాను 2,25,613 ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. వీటితో పాటు పెసర, కంది వంటి పంటలు, చెరకు, మిర్చి పంటలు కూడా సాగు చేస్తున్నారు.


కమ్యూనిస్టులతోనే దేశ భవిష్యత్

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం

బోనకల్: కమ్యూనిస్టులపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, వారు లేకపోతే పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో సీపీఎం నాయకుడు మాదినేని నారాయణ కుమారుడు, రిటైర్డ్ జడ్జి మాదినేని రాధాకృష్ణ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఆదివారం తమ్మినేని పరామర్శించి మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు, పదవుల చుట్టే తిరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. కమ్యూనిస్టులు ఇప్పుడు బలంగా లేకున్నా, భవిష్యత్ మాత్రం కమ్యూనిస్టులదేనని చెప్పారు. కమ్యూనిస్టులను హేళన చేసే వారికి సమాధానం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు మడిపల్లి గోపాల్‌రావు, పొన్నం వెంకటేశ్వరావు, పైడిపల్లి కిషోర్‌కుమార్, గాలి దుర్గారావు, మోదుగు సుధీర్‌బాబు తదితరులు సైతం రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కిన్నెరసాని నీటి విడుదల


కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరద


పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, 1600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో ఆదివారం నీటిమట్టం 406.60 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్‌కు చెందిన ఒక గేటును ఎత్తి ఉంచి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి ప్రతీ గ్రామంలో కాషాయ జెండా ఎగరేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, గ్రామాల అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమవుతుందనే అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇదే సమయాన రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. తద్వారా జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి బాటలు వేయాలని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు గంట్యాల విద్యాసాగర్, వక్కలంక సుబ్రహ్మణ్యం, సన్నె ఉదయప్రతాప్, మందడపు సుబ్బారావు, నున్నా రవికుమార్, పుల్లారావు యాదవ్, డాక్టర్ శీలం పాపారావు, రామలింగేశ్వరరావు, వీరెల్లి రాజేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్‌లో అవకతవకలపై దర్యాప్తు జరపాలి


సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఆయిల్ ఫెడ్ సంస్థలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యేజూలకంటి రంగారెడ్డి డిమాండ్‌చేశారు. ఆయిల్ పామ్ రైతుల రాష్ట్రస్థాయి సదస్సు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుంబూరు మహేశ్వరరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఖమ్మంలో జరగగా రంగారెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ పామాయిల్ సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించినా ఆ స్థాయిలో రైతులకు సలహాలు అందడం లేదన్నారు. అంతేకాక రైతులకు ఇబ్బందులు తలెత్తినప్పుడు బాధ్యతతో వ్యవహరించడం లేదనిచెప్పారు. కేంద్రప్రభుత్వం పామాయిల్ ధర పడిపోకుండా టన్నుకు కనీస మద్దతు ధర రూ.25 వేలుగా నిర్ణయించడమే కాక ఆయిల్ ఫెడ్ ద్వారా సరఫరా చేసిన మొక్కలు పెరగక నష్టోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించేందుకు ఎంపీలు కృషి చేయాలని సూచించారు. రైతు సంఘం నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, బొంతురాంబాబు మాట్లాడగా కొకెరపాటి పుల్లయ్య, కారం శ్రీరాములు, రావు జోగిబాబు, చేలికాని వెంకట్రావు, దొడ్డ చక్రధర్‌రెడ్డి, బుచ్చన్న, గురువారెడ్డి, సంగీతరెడ్డి, చింతనిప్పు చలపతిరావు, ధనమ్మ, పాషా, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి


వంశీ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మధిర: మధిర పెద్ద చెరువులో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఏపీలోని ఎన్టీఆర్‌జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడుకు చెందిన ఇలవరపు వంశీ (21) తన స్నేహితులతో కలిసి ఆదివారం మధిర పెద్దచెరువులో ఈతకు వెళ్లాడు. పూర్తిస్థాయిలో ఈతరాని ఆయన వంశీ ప్యాంట్‌తో పాటే చెరువులోకి దిగాక కాసేపటికి ఆయాసంతో ఒడ్డుకు చేరలేకపోయాడు. ఈ సమయాన నీటిలో మునుగుతున్న ఆయనను కాపాడేందుకు స్నేహితులు యత్నించినా ఫలితం కానరాలేదు. సమాచారం అందుకున్న స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు నాలుగుగంటల పాటు శ్రమించి అతని మృతదేహాన్ని వెలికితీశారు. అయితే, గాలింపు కొనసాగినంత సేపు వంశీ ప్రాణాలతో బయటకు వస్తాడని ఎదురుచూసిన కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఆయన సంజీవరావు – మరియమ్మ దంపతుల్లో నలుగురి సంతానంలో వంశీ ఒక్కడే కుమారుడు కాగా ల్యాబ్ టెక్నీషియన్ కోర్స్ చదువుతున్న ఆయన మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

పాముకాటుతో కూలీ..

నేలకొండపల్లి: పత్తి చేనులో పనిచేస్తున్నమహిళను పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురై మృతిచెందింది. ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన జె.రాధ నేలకొండపల్లి మండలం అనాసాగారంలో పనికి ఆదివారం వచ్చింది. పొలంలో పత్తి తీస్తుండగా పాము కాటేయడంతో మిగతా కూలీలు నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చికిత్స పొందుతున్న మహిళ..

రఘునాథపాలెం: గడ్డి మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. రఘునాథపాలెం మండలం బద్యాతండాకు చెందిన గుగులోతు పద్మ(30) తల్లితో కలిసి నివసిస్తోంది. ఈక్రమాన పద్మ ప్రవర్తన నచ్చక తల్లి మందలించడంతో ఈనెల 3న ఆమె గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఘటనపై పద్మ తల్లి పిటోరి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశామని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం సారధినగర్‌లో నివాసముండే మాదాసు సాయితేజ(19) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తండ్రి ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తుండగా... పిల్లలను తల్లి వదిలివేసి వెళ్లింది. దీంతో సాయితేజ సోదరి పెళ్లిని బంధువులు జరిపించారు. అయితే, ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లి తిరిగి రావడం, మద్యం మత్తులో సాయి గొడవ పడుతుండడంతో అందరూ వెళ్లిపోయారు. ఆపై పెద్దమ్మ కవిత ఇంటి వద్ద ఉంటున్న సాయితేజ శనివారం రాత్రి అమ్మవారి శోభయాత్ర ముగిశాక తమ సొంతింటికి వెళ్లి ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఆయన పెద్దమ్మ ఈ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.